'ఉద్యాన' వీసీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న వీసీ

ఏజీవర్సిటీ: నేషనల్ జియోస్పాసియల్ 2025 అవార్డును ఐఐటీ ముంబయిలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి దండా రాజిరెడ్డి గురువారం అందుకున్నారు. ఫ్రీ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ ఐఐటీ ముంబయి చొరవలో క్రియశీల భాగస్వామ్యం గురించి అవగాహన వ్యాప్తి చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐఎస్ఆర్ఓ మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్ ఈ అవార్డును ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వ విద్యాలయం కన్సల్టెంట్ డాక్టర్ వీరాంజనేయులు, రిజిస్ట్రార్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన



శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం గ్రామంలో సామాజిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆహార భద్రత, పరిశుభ్రత, పౌష్టికాహార విలువలపై ర్యాలీ ప్రదర్శనతో అవగాహన కల్పించారు. మద్యపానంతో జరిగే అనర్థాలపై నాటికను ప్రదర్శించారు.

నియామకం



నిహాల్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను తెలుసుకుంటూ శాశ్వత పరిష్కారాలు చూపించేలా చొరవ తీసుకుంటామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కొయిలకొండ నిహాల్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవా దళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ సేవా దళ్ అధ్యక్షుడిగా కొయిలకొండ నిహాల్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిహాల్ మాట్లాడుతూ... నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందిస్తామన్నారు. పార్టీ అధిష్టానం పిలుపును విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు.

ఆరో అంతస్తు నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి



మహ్మద్ నవాజ్

మైలార్‌దేవ్‌పల్లి: ఆరో అంతస్తులో సెంట్రింగ్ పనులు నిర్వహిస్తూ కాలుజారి కిందపడిన సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్లా సమాచారం మేరకు... నవాబ్‌కుంటకు చెందిన మహ్మద్ నవాజ్(28) భార్య, నలుగురు సంతానం. శాస్త్రీపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కొన్ని రోజులుగా సెంట్రింగ్ పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 6వ అంతస్తులో సెంట్రింగ్ పనులను చేస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు మహ్మద్ నవాజ్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కార్మికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

వ్యక్తి అదృశ్యం

మణికొండ: వాకింగ్ కోసం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోక పోవటంతో అతని భార్య నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... మంచిరేవుల గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన మల్లారెడ్డికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మతిస్థిమితం కోల్పోయాడు. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్న అతను రోజులానే గురువారం ఉదయం ఇంటి నుంచి వాకింగ్ చేసేందుకు బయటకు వెళ్లిడు. తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వాకబు చేసినా ప్రయోజనం లేనందున భార్య భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఉత్తమ ఫార్మసిస్టుగా వందన



మైలార్‌దేవ్‌పల్లి: ప్రపంచ జనాభా వారోత్సవాలను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని హసన్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఫార్మసిస్టుగా పని చేస్తున్న మునుగపాటి వందన రాజేంద్రనగర్ డివిజన్ ఉత్తమ ఫార్మసిస్టుగా అవార్డును అందుకున్నారు. గురువారం కామినేని ఆస్పత్రిలో జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి విజయ పూర్ణిమల చేతుల మీదుగా ఆమె అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

నీటి కష్టాలు తీరేనా?



మణికొండ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ట్యాంకర్లు

- మొహం చాటేసిన వరుణుడు
- పెరగని భూగర్భ జలాలతో బోర్లు నో రీచార్జ్
- నీటి కోసం ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులపై ప్రజాగ్రహం

మణికొండ: వర్షా కాలం ప్రారంభమై నెల దాటినా వరుడు మొహం చాటేయడంతో నీటి కష్టాలు ఇప్పట్లో తీరేలా కన్పించడం లేదు. దక్షిణ తెలంగాణలో ఇప్పటి వరకు మంచి వర్షం కురవక పోవటంతో సింగూరు, మంజీరా, గండిపేట, హిమాయత్ సాగర్‌లలోకి చుక్క నీరు చేరలేదు. ఇప్పటి వరకు గండిపేట మండల పరిధిలోనూ చెప్పుకోదగ్గ పెద్ద వర్షం కురవక పోవటంతో అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో వేసవిలో వట్టిపోయిన బోర్లు రీచార్జ్ కాలేదు. పాత బోర్ల పరిస్థితి అలా ఉండగా కొత్తగా మరిన్ని బోర్లు వట్టిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జలమండలి నుంచి సరఫరా చేసే నీరు రోజుకు ఇంత సమయం తగ్గించుకుంటూ పోతుండటంతో మండల ప్రజలకు నీటి బాదలు తప్పటం లేదు.

వట్టి పోతున్న బోర్లు...

గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీలలో ఇబ్బడి ముబ్బడిగా గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు వెలుస్తున్నాయి. దాంతో వాటిల్లోకి వచ్చే ప్రజలకు నీటి అవసరాలు తీరేలా బోర్లు వేసి మొదట్లో వాడుకునే నీటిని అందించినా అవి కాస్త ఒకటి, రెండు సంవత్సరాలు కాగానే వట్టిపోతున్నారు. అడుగడుగునా బోర్లు వేయటం, వాటి నుంచి లక్షలాది లీటర్ల నీటిని తోడేస్తుండటంతో భూగర్భజలాలు మరింత కిందకు వెళ్తున్నాయి.

- గండిపేట మండల పరిధిలో భారీ వర్షాలు కురిస్తే 8 నుంచి 10 మీటర్ల లోతులో నీరు లభిస్తుంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు వర్షాలు కురవక పోవటంతో అది కాస్తా ఏకంగా 20 మీటర్ల లోతుకు చేరుకుంది. దాంతో అనేక బోర్లు వట్టిపోతున్నాయి. ప్రజలతోపాటు అటు జలమండలి, ఇటు మున్సిపాలిటీలు ఇంకుడు గుంతల ఏర్పాటు విషయాన్ని పట్టించుకోకపోవటంతో వర్షం నీరంతా వృథాగా మూసీలోకి వెళ్తోంది.

పట్టించుకోని జలమండలి...

గండిపేట మండల పరిధిలో వస్తున్న కొత్త నిర్మాణాలకు అడిగిన వెంటనే నీటి కనెక్షన్‌లను మంజూరు చేస్తున్న జలమండలి అధికారులు అందుకు అనుగుణంగా గండిపేట, హిమాయత్‌సాగర్ చెరువుల వద్దనే పెద్ద సామర్థ్యంతో ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేసి నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసి అందించే విషయాన్ని పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. మంజీరా నది నుంచి షేక్‌పేట రిజర్వాయర్ వరకు ఉన్న పైప్‌లైన్ శిథిలావస్థకు చేరి నెలకు ఒకసారైనా పగిలిపోతున్నా మరింత సామర్థ్యం పెంచి కొత్త పైప్‌లైన్ వేయాలనే విషయంపై దృష్టి పెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్న మెయిన్ పైప్‌లైన్‌కే నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా కొత్త బల్క్ కనెక్షన్‌లు ఇచ్చి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సామాన్య ప్రజలకు నీటి సరఫరా సమయాన్ని తగ్గిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకర్లతోనే...

అటు బోర్లు వట్టిపోవటం, ఇటు జలమండలి సరఫరా చేసే నీరు తగ్గిపోతుండటంతో నీటి ట్యాంకర్లపై ఆధారపడి జీవించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. జలమండలి ద్వారా బుక్ చేసిన ట్యాంకర్ల ఎలాంటి అంతరాయాలు లేనపుడు 24 గంటలలో వస్తుందని, అదే పైప్‌లైన్‌లు పగిలి నీటి సరఫరా నిలిచిన సమయంలో వాటిని సరఫరా చేయలేక అధికారులు, సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.

- ప్రైవేటు ట్యాంకర్ల యజమానులు అదే అదనుగా ఒక్కో ట్యాంకర్‌కు రూ. వెయ్యి నుంచి రూ. 2 వేల వరకు దండుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా జలమండలి అధికారులు మంజీరా నుంచి కొత్త పైప్‌లైన్ యుద్ధప్రాతిపదికన వేసి స్థానిక అవసరాలకు తగ్గట్టుగా నీటిని సరఫరా చేయాలంటున్నారు. అప్పటి వరకు కొత్త బల్క్ కనెక్షన్ల మంజూరును ఆపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ట్యాంకర్లతో నీటిని తీసుకుంటున్న దృశ్యం

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



మొక్క నాటుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే పర్యావరణం తద్వారా మానవ మనుగడ పదికాలాలపాటు పచ్చగా ఉంటుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా 14వ డివిజన్‌లోని భవానీనగర్ కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో ప్రాణవాయువును అధికంగా ఇచ్చే మొక్కలు పెంచి పచ్చని బండ్లగూడ జాగీర్‌గా తీర్చిదదిద్దుతామని తెలిపారు. ఏజీఎం డి.చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ టి.పర్వతాలు, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, వివిధ సెక్షన్ అధికారులు, సూపర్‌వైజర్ అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు డిఈవోలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, మహిళ సంఘాల ప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలహిల్స్ పార్క్‌ను అభివృద్ధి చేయండి



పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మణికొండ: కాలనీ వాసుల సుదీర్ఘ పోరాటం తరువాత దక్కిన తిరుమలహిల్స్ పార్క్‌ను మున్సిపాలిటీ అధికారులు వెంటనే అభివృద్ధి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్‌లు డిమాండ్ చేశారు. గురువారం వారు పార్టీ నాయకులతో కలిసి ఫెన్సింగ్ వేసిన పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తిరుమలహిల్స్ కాలనీలో రికార్డుల ప్రకారం 6054 గజాల పార్కు ఉండగా అందులో కేవలం 5 వేల గజాల స్థలానికి మున్సిపాలిటీ అధికారులు ఫెన్సింగ్ వేసి చేతులు దులుపుకొన్నారన్నారు. మిగిలిన 1054 గజాల స్థలాన్ని గుర్తించి పరిరక్షించటంతో పాటు వెంటనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, రూపారెడ్డి, రాజేంద్రప్రసాద్, మాల్యాద్రి నాయుడు, సునిత, శ్రీకాంత్, శ్రీధర్, షేక్ ఆరీఫ్, విఠల్, భానుచందర్, బాబురావులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



మంజూరు లేఖను అందుకుంటున్న కాలనీవాసులు

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు అహర్నిశలు కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంత్‌నగర్ కాలనీ వాసులు కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను గతంలో కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రూ. 30 లక్షలను మంజూరు చేయించి అందుకు సంబంధించిన లేఖను కాలనీ వాసులకు గురువారం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రశాంత్‌నగర్ కాలనీ రోడ్ నెంబర్ 14(మార్కెట్ రోడ్ వెనక వైపు రోడ్డు) కాంక్రీట్ రోడ్డు వేసేందుకు రూ. 30 లక్షలను మంజూరు చేశామన్నారు. దీనికి సహకరించిన కార్పొరేటర్ సాగర్‌గౌడ్‌తో పాటు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ప్రశాంత్‌నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నేతలు ఎల్లెంకి సత్య, సురేష్‌రెడ్డి, మురళీగౌడ్, హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు కళ్లద్దాలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి, దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రవి మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ప్రతినిధులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో హర్షించదగ్గవన్నారు. పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. నిత్యం ఇలాగే విద్యార్థుల బాగోతులు చూసుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యులను కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు గుండ్రాపల్లి మురళీకృష్ణ, సీతారావు, కె.రాంభూపాల్‌రెడ్డి, నర్సింహ, డాక్టర్ ఎం.విజయలక్ష్మీ, పి.ప్రమోద్‌రెడ్డి, లీనా నీలేష్, ఉపాధ్యాయులు ఎం.డి.సాదిక్‌అలీ, శ్రీధర్, ప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రోసా, మాధవి, లతీఫున్నీసా, వంశీ, రాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు



సేవా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ దివ్యశ్రీ

శంషాబాద్ రూరల్: మండల వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్కూడ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ, పెద్దషాపూర్ పీహెచ్‌సీ హెచ్ఈఓ శ్రీనివాసు ఈ పురస్కారం అందుకున్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయపూర్ణిమ, డీపీఓ షఫీ, డెమో అధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి అక్రమన్, పూనమ్, తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

రాజేంద్రనగర్: విద్యుత్ తీగలు తెగి పడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురైన సంఘటన రాజేంద్రనగర్ గ్రీన్ సిటీ పోచమ్మ ఆలయ సమీపాన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే స్పందించి విద్యుత్ వైర్ తెగిపడ్డ ప్రాంతానికి ఎవరిని వెళ్లకుండా రోడ్డుపై వాహనాలను అడ్డు పెట్టడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రీన్ సిటీ పోచమ్మ దేవాలయం వద్ద గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్థానికంగా ఉన్న ఇండ్లకు విద్యుత్ పోళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లను ఇచ్చారు. గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం పాఠశాలలకు, ఉద్యోగాలకు వెళ్లేవారు ఈ దారి గుండా రాకపోకలు సాగిస్తుండటంతో స్థానికులు రోడ్డుకు అడ్డంగా వాహనాలను ఏర్పాటు చేసి అప్రమత్తం చేశారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.



రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట నూతనంగా సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు గురువారం పరిశీలించారు. ఆయా పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గుంజి బాబురావు సూచించారు. డీఈ రామచంద్రరాజు, ఏఈ వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌లతో కలిసి పరిశీలించారు. ఎస్సీ మోర్చా డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, నేతలు అరుణ్ కుమార్, రాజు, నరసింహ, రఘుమారెడ్డి, కాంట్రాక్టర్ అబేద్ తదితరులు పాల్గొన్నారు.

పాములతో పరేషాన్

శంషాబాద్ రూరల్: మండలంలోని రాయన్నగూడలో ఉన్న ఆవాసాల మధ్య విష సర్పాలు తిరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి పాములు తిరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడంలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రహదారుల అభివృద్ధికి కృషి



పిల్లోనిగూడలో ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని పలు అభివృద్ధి పనులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్ల అభివృద్ధితో స్థానికులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని అన్నారు. సెంట్రల్ రోడ్డు అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులు రూ. 3.4 కోట్లతో బెంగళూరు జాతీయ రహదారి నుంచి అలీ కోల్‌తండా రోడ్డు పనులు ప్రారంభించారు. రూ. కోట్ల నిధులతో పిల్లోనిగూడ-తిమ్మాపూర్ రైల్వేగేటు వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసకువచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు బుచ్చమ్మ, నాయకులు నర్సింహ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాణించిన మున్సిపాలిటీలు

మణికొండ: మున్సిపాలిటీలలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై రాష్ట్ర స్థాయిల్లో చేపట్టిన సర్వేలో గండిపేట మండల పరిధిలోని మున్సిపాలిటీలు అగ్రస్థానంలో నిలిచాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో ప్రజలే తమ అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటికపుడు చెత్తను తొలగించటం, ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంచటం, చెత్తతో వర్మికంపోస్టు ఎరువు తయారు చేయటం, తడి, పొడి రూపంలో చెత్తను సేకరించటం లాంటి చర్యలతో రాష్ట్రంలోనే నార్సింగి మున్సిపాలిటీ మూడవ స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో జీహెచ్ఎంసీ నిలవగా రెండవ స్థానంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం నిలిచింది. మూడవ స్థానంలో నార్సింగి మున్సిపాలిటీ నిలవగా 7వ స్థానంలో మణికొండ మున్సిపాలిటీ, 19వ స్థానంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లు నిలిచాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 146 మున్సిపాలిటీలలో ఆయా స్థానాలను గండిపేట మండల పరిధిలోని మున్సిపాలిటీలు దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల కమీషనర్‌లు మాట్లాడుతూ మున్సిపాలిటీలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ సిబ్బంది పూర్తి స్థాయిలో కృషి చేయటంతో పాటు ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. రాబోయే రోజుల్లోనే ఇదే తరహాల్లో మున్సిపాలిటీలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు.

గ్రామ దేవతలకు వేడుకగా బోనాలు



నార్సింగిలో లక్ష్మమ్మను దర్శించుకున్న మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు

మణికొండ: బోనాల జాతరను నార్సింగి మున్సిపల్‌తోపాటు ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే మాత బోనాలతో అమ్మవారికి మొదట నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ఆట పాటలతో తొట్టెలను ఊరేగించి అమ్మవార్లకు సమర్పించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా బోనాలను నెత్తిన పెట్టుకుని శివసత్తుల శిగాలు, పోతురాజుల విన్యాసాలతో దేవాలయాలకు చేరుకుని అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. నార్సింగిలోని లక్ష్మమ్మ, ఖానాపూర్‌లోని పోచమ్మ, వట్టినాగులపల్లిలోని దుర్గామాత, పోచమ్మ దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తమ కుటుంబాలను, గ్రామాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. దేవాలయాల వద్ద మహిళలకు అవసరమైన ఏర్పాట్లను మున్సిపాలిటీతో పాటు గ్రామస్తులు పర్యవేక్షించారు.



ఖానాపూర్‌లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్...



ఖానాపూర్‌లో బోనాలతో మహిళలు



ఖానాపూర్‌లో మున్సిపల్ కమిషనర్, డీఈ, ఏఈలు



వట్టినాగులపల్లిలో బోనాలతో మహిళలు